ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపుటి : 3 సంచిక :229 శుక్రవారం జూన్ 12 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## జిమ్ నిర్వాహకుడి దారుణ హత్య



- జిమ్ వద్ద కాల్పులు
- ఐదు సెకన్లలో దాడి
- బిష్ణోయ్ గ్యాంగ్ అనుమానం

చండీగఢ్, జూన్ 11 (మనప్రజాప్రతినిధి): హర్యానా రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కాల్పుల ఘటనలో ఓ యువ జిమ్ నిర్వాహకుడు దారుణంగా హత్యకు గురయ్యాడు. హన్సీ పట్టణంలో గురువారం ఉదయం జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

2

## మంగళగిరి ఆలయ అభివృద్ధికి శ్రీకారం



- జీర్ణోద్ధరణ పనుల సమీక్ష
- పలు నిర్మాణాలకు ఆమోదం
- భక్తులకు మెరుగైన సౌకర్యాలు

మంగళగిరి, జూన్ 11 (మనప్రజాప్రతినిధి): మంగళగిరి దిగువ సన్నిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఆలయ జీర్ణోద్ధరణతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు ఆలయంలో చేపట్టాల్సిన పనులపై విద్య, సమాచార సాంకేతిక శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అధికారులు ఆలయ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను సమగ్రంగా వివరించారు. ఆలయ చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడుతూ భక్తులకు మెరుగైన

2

## డీఎస్పీపై జగన్ తీవ్ర ఆరోపణలు



- సీబీఐ విచారణ కోరుతూ..
- అక్రమాలపై విమర్శలు
- యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

2

## హుస్నాబాద్ బస్టాండ్‌లో... మంత్రి పర్యటన



- ప్రయాణికుల సమస్యలపై దృష్టి
- వరద ముప్పుపై సమీక్ష
- మౌలిక సదుపాయాల మెరుగుదల

2

## నీతి ఆయోగ్ సమావేశంలో అమిత్ షా

- ప్రధానితో కీలక సమావేశం
- అభివృద్ధి లక్ష్యాలపై చర్చ
- వికసిత భారత్ దిశగా అడుగులు




2

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



- పజలతో నేరుగా మమేకం
- అభివృద్ధి పనులకు ప్రాధాన్యం
- పతి కుటుంబానికి ప్రభుత్వ అండ
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

2

## రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు



- ప్రజలకు మెరుగైన సేవలు
- తొలి దశలో నిర్మాణాలు
- ఆధునిక సౌకర్యాల కల్పన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, జూన్ 11 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఈ భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల వివరాలను సేకరించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ

2

## టీఆర్ఎస్ పేరుపై వివాదం

- కొత్త పార్టీకి అడ్డంకులు
- ఎన్నికల సంఘానికి అభ్యంతరాలు
- ఉత్కంఠ రేపుతున్న పేరు



హైదరాబాద్, జూన్ 11 (మనప్రజాప్రతినిధి): కవిత ప్రతిపాదించిన తెలంగాణ రక్షణ సేన పార్టీకి ఆరంభంలోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పార్టీకి టీఆర్ఎస్ అనే సంక్షిప్త నామాన్ని వినియోగించాలన్న ప్రతిపాదనపై వివాదం చెలరేగడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పేరును ఇతర రాజకీయ సంస్థలకు కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి పలు

3

## బీజేపీపై షర్మిల విమర్శలు



- కేంద్రంపై ప్రశ్నల వర్షం
- వైఫల్యాలపై జవాబు కోరుతూ..
- కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని వెల్లడి

అమరావతి, జూన్ 11 (మనప్రజాప్రతినిధి): కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యసభ సీటు అంశంపై భారతీయ జనతా పార్టీ నేతలు చేస్తున్న

3

## జులై 2న భూపోరాటం కవిత




- పోస్టర్ ఆవిష్కరించిన కవిత
- ఉద్యమకారుల భూముల డిమాండ్
- పజలకు పాల్గొనాలంటూ పిలుపు

హైదరాబాద్, జూన్ 11 (మనప్రజాప్రతినిధి): బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఉద్యమకారుల భూపోరాట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జులై 2న ఉప్పల్ భగాయత్

3

## నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

- ప్రత్యేక బృందాల నిఘా
- ఖరీఫ్ సాగుపై అవగాహన
- రైతులకు అప్రమత్తత సూచనలు

భువనగిరి,జూన్ 11(మనప్రజాప్రతినిధి): యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఖరీఫ్ పంటల సాగుకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు నకిలీ విత్తనాల మోసాల నుంచి జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారి అక్షాన్ష్ యాదవ్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ బృందాలు నిరంతరం నిఘా నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపైనే కాకుండా వాటిని కొనుగోలు చేసి అక్రమ రవాణా లేదా పంపిణీ చేసే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ సీజన్‌లో రైతులు మోసపోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రైతులు గుర్తింపు పొందిన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని, అనుమానాస్పదంగా కనిపించే విత్తనాలపై వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని అధికారులు పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండి అధికారులతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# జిమ్ నిర్వాహకుడి దారుణ హత్య

మెదటి పేజీ తరువాయి



మృతుడిని కపిల్‌గా గుర్తించారు అతనికి 27 సంవత్సరాల వయస్సు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. జిమ్ వద్దనే కస్టమర్లకు శిక్షణ ఇస్తున్న సమయంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం. పోలీసుల వివరాల ప్రకారం, కపిల్ జిమ్ బయట ఉన్న సమయంలో ఇద్దరు దుండగులు మోటార్ సైకిల్‌పై అక్కడికి చేరుకున్నారు. అతనికి అత్యంత సమీపం నుంచి కాల్పులు జరిపారు. కేవలం ఐదు సెకన్ల వ్యవధిలోనే దాదాపు పది రౌండ్ల కాల్పులు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ ఆకస్మిక దాడితో అక్కడున్నవారు భయాందోళనలకు గురయ్యారు.తీవ్రంగా గాయపడిన కపిల్‌ను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలోనే అతను ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. యువకుడి హత్యపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాల్పుల సమయంలో జిమ్ సమీపంలో ఉన్న ఓ మహిళ కూడా గాయపడింది. ఆమెను హిసార్ సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో ఆమెకు ఎలా గాయాలయ్యాయన్న అంశంపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కపిల్ స్వస్థలం జింద్ జిల్లాలోని దాలంవాలా గ్రామం కాగా, ప్రస్తుతం హన్సీ పట్టణంలోని శాంతి నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతనిపై దుండగులు ఎందుకు దాడి చేశారన్న విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. వ్యక్తిగత విభేదాలు, పాత కక్షలు లేదా ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఘటన స్థలంలోని సీసీటీవీ దృశ్యాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ హత్య వెనుక కుప్రసిద్ధ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే దీనిపై ఇంకా అధికారిక నిర్ధారణ వెలువడలేదు. దర్యాప్తు పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

# నీతి ఆయోగ్ సమావేశంలో అమిత్ షా

మెదటి పేజీ తరువాయి




న్యూఢిల్లీ, జూన్ 11 (మనప్రజాప్రతినిధి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా నీతి ఆయోగ్ పాలక మండలి పదకొండవ సమావేశంలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దేశ అభివృద్ధి, భవిష్యత్ లక్ష్యాలు, రాష్ట్రాల భాగస్వామ్యంపై విస్తృతంగా చర్చ జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ దేశ అభివృద్ధి దిశగా ప్రభుత్వ దృష్టిని కార్యరూపంలోకి తీసుకువెళ్లడంలో నీతి ఆయోగ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు ఈ సంస్థ సమర్థవంతంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం కేవలం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో పోటీ పడటమే కాకుండా అనేక రంగాల్లో ముందంజలో సాగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సాంకేతిక పురోగతి, సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశం వేగంగా ముందుకు సాగుతోందని వివరించారు.రెండు వేల నలభై ఏడు నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని చేరుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అమిత్ షా తెలిపారు. ఈ లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వాలు, విధాన రూపకర్తలు, ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో వివిధ రాష్ట్రాల అభివృద్ధి ప్రణాళికలు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల పురోగతిపై చర్చ జరిగినట్లు సమాచారం. దేశాన్ని మరింత శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా సమావేశంలో పలు అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు వెల్లడైంది. భారత్‌ను సమగ్ర అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రపంచంలో అగ్రగామి దేశంగా నిలబెట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అమిత్ షా స్పష్టం చేశారు. వికసిత భారత్ లక్ష్య సాధనకు అన్ని వర్గాలు కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మంగళగిరి ఆలయ అభివృద్ధికి శ్రీకారం

మెదటి పేజీ తరువాయి

సౌకర్యాలు కల్పించే విధంగా పనులను చేపట్టాలని మంత్రి సూచించినట్లు సమాచారం. ఆలయ నిర్మాణాల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. చారిత్రక ప్రాముఖ్యత కలిగిన శ్రీకృష్ణదేవరాయ మండపం పునరుద్ధరణకు సమావేశంలో ఆమోదం లభించింది. కాలక్రమేణా దెబ్బతిన్న నిర్మాణాలను సంప్రదాయ శైలిలో పునర్నిర్మించి ఆలయ వైభవాన్ని మరింత పెంచేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే ఆలయ సౌందర్యం మరింత ఆకర్షణీయంగా మారనుంది. అలాగే యాగశాల, గంట మండపం పునర్నిర్మాణానికి కూడా మంత్రి ఆమోదం తెలిపారు. భక్తుల ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అనువుగా ఉండే విధంగా ఆధునిక సదుపాయాలతో ఈ నిర్మాణాలను అభివృద్ధి చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలకు మంత్రి సానుకూలంగా స్పందించారు.దేవాలయానికి వచ్చే వాహనాల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని నూతన వాహనశాల నిర్మాణానికి కూడా సమావేశంలో ఆమోదం లభించింది. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు. మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఆలయ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత భక్తులకు మరింత సౌకర్యవంతమైన దర్శన ఏర్పాట్లు కల్పించడంతో పాటు క్షేత్ర ఆధ్యాత్మిక వైభవం మరింత పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# హుస్నాబాద్ బస్టాండ్‌లో మంత్రి పర్యటన

మెదటి పేజీ తరువాయి

హుస్నాబాద్, జూన్ 11 (మనప్రజాప్రతినిధి): హుస్నాబాద్ బస్టాండ్‌ను రాష్ట్ర రవాణా సంస్థ నిర్వహణ సంచాలకుడు నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. బస్టాండ్‌లోని సౌకర్యాలు, ప్రయాణికులకు అందుతున్న సేవలపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడి బస్సుల రాకపోకలు, మౌలిక సదుపాయాల పరిస్థితిపై వివరాలు




తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా హుస్నాబాద్ బస్టాండ్ వరద ముప్పును ఎదుర్కొంటున్న నేపథ్యంలో మంత్రి ప్రత్యేకంగా పరిస్థితిని సమీక్షించారు. వర్షపు నీరు బస్టాండ్‌లో నిలిచిపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న కాలువను ప్రధాన రహదారి పక్కనున్న మురుగునీటి కాలువకు అనుసంధానం చేసేలా భూగర్భ కాలువ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. దీనివల్ల వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లి బస్టాండ్ ముంపు సమస్య తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.ఈ పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి తగిన ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే రవాణా సంస్థ అధికారులు స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన పనులపై కూడా చర్చ జరిగింది. వేచి ఉండే ప్రదేశాలు, పరిశుభ్రత, తాగునీటి సదుపాయం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు చిత్తరి పద్మ, కౌన్సిలర్లు, రవాణా సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. హుస్నాబాద్ బస్టాండ్ అభివృద్ధి, వరద ముప్పు నివారణ చర్యలను వేగవంతంగా అమలు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# డీఎస్సీపై జగన్ తీవ్ర ఆరోపణలు

మెదటి పేజీ తరువాయి



అమరావతి, జూన్ 11 (మన ప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ మెగా డీఎస్సీ పరీక్షలు, నియామకాల ప్రక్రియలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని, కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. నేడు నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ డీఎస్సీకి సంబంధించిన అంశాలు వెలుగులోకి వస్తున్న కొద్దీ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం లక్షలాది మంది నిరుద్యోగ యువత నమ్మకాన్ని దెబ్బతీసిందని జగన్ విమర్శించారు. ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు పొందాల్సిన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, నియామక ప్రక్రియలో పారదర్శకత కనిపించలేదని ఆరోపించారు. యువత ఆశలు, భవిష్యత్తు ముడిపడి ఉన్న పరీక్షల్లో కూడా అవినీతి, అక్రమాలు చోటుచేసుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు .ప్రభుత్వ చర్యలను నేటి యువత నిశితంగా గమనిస్తోందని జగన్ అన్నారు. అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించే తరం ఇది అని, యువతకు నష్టం జరిగితే వారు తమ అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేస్తారని పేర్కొన్నారు. యువత ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచించారు. డీఎస్సీ నిర్వహణలో కీలకమైన బాధ్యతలను ఒకే అధికారి చేతిలో కేంద్రీకరించారని జగన్ ఆరోపించారు. కన్వీనర్ పాత్రను పక్కనపెట్టి ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఇతర అధికారులకు అప్పగించడం వల్ల అనేక అనుమానాలు తలెత్తాయని అన్నారు. ప్రశ్నపత్రాలు ఎంతమంది చేతుల్లోకి వెళ్లాయి, ఎంత మేరకు అక్రమాలు జరిగాయి అనే విషయాలు స్వతంత్ర విచారణ ద్వారానే బయటపడతాయని పేర్కొన్నారు.క్రీడా కోటా నియామకాల విషయంలో కూడా తీవ్ర అవకతవకలు జరిగాయని జగన్ ఆరోపించారు. కేవలం పాల్గొన్నట్లు ధ్రువపత్రాలు ఉన్న వారికి ఉద్యోగాలు కల్పించారని, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన కొందరు అభ్యర్థులు అవకాశాలు కోల్పోయారని పేర్కొన్నారు. అర్హత పరీక్షలు రాయకుండానే వందలాది మందికి ఉద్యోగాలు దక్కాయని ఆరోపిస్తూ దీనిపై కూడా పూర్తి స్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ విడుదల నుంచి నియామక పత్రాల పంపిణీ వరకు కేవలం నాలుగు నెలల్లో లక్షా ముప్పై వేల ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామని జగన్ గుర్తుచేశారు. డీఎస్సీ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బాధ్యత వహించాలని అన్నారు. ఈ అంశంపై నిష్పాక్షిక దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అందుకే సీబీఐ విచారణ కోరుతున్నామని స్పష్టం చేశారు. అలాగే జూన్ 12న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

మెదటి పేజీ తరువాయి

నల్లగొండ, జూన్ 11 (మనప్రజాప్రతినిధి): ప్రజలతో నేరుగా మమేక మవడం, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను చూపడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండలోని తన శిబిర కార్యాలయంలో ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సానుకూలంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు





తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచేలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని వివరించారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పనిచేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా పనిచేస్తానని తెలిపారు.

# రెవెన్యూ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

మెదటి పేజీ తరువాయి



కార్యాలయాలు గౌరవప్రదంగా ఉండాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.మొదటి దశలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న, శిథిలావస్థలో ఉన్న నూట ఇరవై ఐదు తహసీల్దార్ కార్యాలయాలు, పదకొండు ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన శాశ్వత భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టేందుకు కూడా ప్రత్యేక నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను వెంటనే గుర్తించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించే అన్ని భవనాలను ఒకే నమూనాలో రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా, తక్కువ ఖర్చుతో అధిక సేవలు అందించేలా నమూనాలు సిద్ధం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. తుది రూపకల్పనపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో కూడా ఆధునిక సమీకృత భవనాల నిర్మాణం కొనసాగుతోందని మంత్రి వివరించారు. బయటి వలయ రహదారి పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని ముప్పై తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పన్నెండు సమూహాలుగా విభజించి భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి, మేడ్చల్ మల్కాజిగిరి, పఠాన్ చెరువు, కోహెడ ప్రాంతాల్లో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కూడా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పత్రాల నమోదుల సంఖ్య ఆధారంగా నాలుగు వేల నుంచి పది వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే నమూనాలో కొత్త భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి అవసరమైన భూముల గుర్తింపు ప్రక్రియ కూడా వేగంగా కొనసాగుతోందని వెల్లడించారు. రాష్ట్ర పరిపాలనను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# టీఆర్ఎస్ పేరుపై వివాదం




అభ్యంతరాలు చేరుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో భారత్ రాష్ట్ర సమితి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. టీఆర్ఎస్ అనే పేరు తెలంగాణ ఉద్యమ చరిత్రతో ముడిపడి ఉందని, ఉద్యమ కాలం నుంచి ప్రజల భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచిందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రజలు తమ పార్టీని టీఆర్ఎస్ పేరుతోనే గుర్తిస్తున్నారని వాదిస్తూ, ఆ పేరును మరో రాజకీయ సంస్థకు కేటాయించరాదని ఎన్నికల సంఘాన్ని కోరింది.ఇదిలా ఉండగా, కవిత పార్టీ ప్రకటనకు ముందే మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన తెలంగాణ రాష్ట్రసామాజిక సేన అనే సంస్థ కూడా టీఆర్ఎస్ సంక్షిప్త నామం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ పేరుపై పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో ప్రజల నుంచి కూడా పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు ఎన్నికల సంఘానికి చేరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పత్రికల్లో వచ్చిన ప్రకటనల ఆధారంగా వందల సంఖ్యలో అభ్యంతర పత్రాలు ఎన్నికల సంఘానికి అందినట్లు సమాచారం. దీంతో ఈ అంశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే తెలంగాణ రాజ్య సమితి పేరుతో నమోదైన మరో రాజకీయ పార్టీ కూడా టీఆర్ఎస్ సంక్షిప్త నామం వినియోగంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎన్నికల సంఘం దృష్టికి తమ వాదనలను తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో కవిత తరఫు ప్రతినిధులు త్వరలో ఎన్నికల సంఘాన్ని కలిసి తమ వాదనలను వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకే పేరుపై వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న తరుణంలో తెలంగాణ రక్షణ సేనకు టీఆర్ఎస్ సంక్షిప్త నామం దక్కుతుందా లేదా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది

# బీజేపీపై షర్మిల విమర్శలు




వ్యాఖ్యలను ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వ పన్నెండేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలపై సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యసభ సీటు అనేది మాట ఇచ్చిన వారికి, తీసుకున్న వారికి సంబంధించిన అంశమని, దీనిపై భారతీయ జనతా పార్టీ నేతలు స్పందించడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తుంటే సమాధానాలు చెప్పలేక ఇతర అంశాలను ప్రస్తావిస్తూ దృష్టి మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన పన్నెండు ప్రధాన అంశాలపై చర్చకు సిద్ధమా అని కేంద్ర ప్రభుత్వాన్ని షర్మిల ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడం, నిరుద్యోగ సమస్య, పరీక్షా పత్రాల లీకేజీలు, మహిళలపై జరుగుతున్న నేరాల వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ ఆర్థిక పరిస్థితిపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న భారీ అప్పులు ఎక్కడ ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. దేశ ఆర్థికాభివృద్ధిపై గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం రూపాయి విలువ క్షీణతపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.రైతుల సమస్యలపై కూడా షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ రైతుల ఆత్మహత్యలు ఎందుకు కొనసాగుతున్నాయో వివరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లకు సమర్థవంతమైన పరిష్కారాలు చూపడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. విభజన రాజకీయాలపై కూడా భారతీయ జనతా పార్టీని ఆమె విమర్శించారు. మత, సామాజిక విభేదాలను రెచ్చగొట్టే రాజకీయాలు దేశానికి మంచివి కావని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యమని, రాష్ట్ర అభివృద్ధి కోసం తమ పార్టీ అంకితభావంతో పనిచేస్తుందని, ప్రజా ఉద్యమాల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని షర్మిల స్పష్టం చేశారు.

# జులై 2న భూపోరాటం కవిత




ప్రాంతంలో భూపోరాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కవిత ప్రకటించారు. ఉద్యమకారులకు కేటాయించాలని నిర్ణయించిన భూముల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకు భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు రెండువందల యాభై గజాల భూమి ఇస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ అమలు జరగలేదని ఆమె విమర్శించారు. అర్హులైన ఉద్యమకారులను గుర్తించి వెంటనే భూములు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ భావజాలంపై కొందరు దాడి చేస్తున్నారని కవిత ఆరోపించారు. తెలంగాణ స్ఫూర్తిని దెబ్బతీయడానికి కుట్రలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జులై 2న నిర్వహించే భూపోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి తెలంగాణవాది బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరగాలని కోరుకునే ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువత, మహిళలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం ఉద్యమకారులు తమ జీవితాలను అంకితం చేశారని, వారికి న్యాయం జరిగేలా జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.

# తెలంగాణ ఉద్యమ పోరాట యోధుడు మురళీధర్ దేశ్‌పాండే మృతి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 11: మెదక్ జిల్లా, చేగుంట మండలం, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో క్రియా శీలకంగా పాల్గొన్న పోరాట యోధుడు లింగరాజు మురళీధర్ దేశ్‌పాండే మరణం పట్ల చేగుంట మండలం కిష్టాపూర్ (పులిమామిడి) మాజీ సర్పంచ్ నాయిని రాజగోపాల్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్ కొత్తపేటలోని దేశ్‌పాండే స్వగృహంలో ఆయన భౌతిక కాయానికి రాజగోపాల్ పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ.. వివక్షకు గురవుతున్న వారి హక్కుల సాధనకై, కళాకారుల సంక్షేమం కోసం, దేశ్‌పాండే తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అనంతరం కొత్తపేట నుండి సరూర్ నగర్ వీవీ కాలనీ స్మశాన వాటిక వరకు సాగిన అంతిమయాత్రలో ఆయన పాల్గొన్నారు. దేశ్‌పాండే ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ట్రస్ట్ తెలంగాణ ఇంచార్జ్ ఈద స్వామి యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

# రెండు ముక్కలైన శరీరం....!





చేగుంట జూన్ 11:మాసాయిపేట్ మండల పరిధిలోని స్టేషన్ మాసాయిపేట్, రైల్వే స్టేషన్లో గురువారం తెల్లవారుజామున ఇస్లాంపూర్ గ్రామనికి చెందిన దుందిగొల్ల దాస్( 28) మేడ్చల్ కు పని నిమిత్తము రైలు లో వెళ్తుండగా రైలు నుంచి కాలు జారి పడి శరీరం రెండు ముక్కలై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు, ఇతనికి, భార్య కళ్యాణి,ఇద్దరు కొడుకులు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు,ఘటనపై స్టేషన్ మాస్టర్,కామారెడ్డి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మోడల్ బాలికల హాస్టల్లోఏఎన్ఎం,కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం




మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 11: చేగుంట మండల పరిధిలోని వడియారం తెలంగాణ మోడల్ గర్ల్స్ హాస్టల్లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం,కుక్ ( వంట మనిషి)పోస్టు భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు హాస్టల్ ఇన్ ఛార్జ్ స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హత : అభ్యర్థులు ఏఎన్ఎం కోర్స్,లేదా బి.ఎస్సి నర్సింగ్, కుక్ కు 10తరగతి పూర్తి చేసి ఉండాలి అని అన్నారు, దరఖాస్తు విధానం: ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా హాస్టల్ కార్యాలయంలో సంప్రదించవచ్చు లేదా ఫోన్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. చివరి తేదీ: దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 15, 2026 ఆఖరి తేదీగా నిర్ణయించారు. అర్హత కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం హాస్టల్ వార్డెన్ స్వాతిని 6300981605 నంబర్లో సంప్రదించాలని ఆమె కోరారు. నిర్జిత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# సోనో విజన్ షాపులో జరిగిన ఫోన్ల చోరీ...

## కీలక ఆధారాలు, వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంఘటనా స్థలానికి చేరుకొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్.నగరంలోని ప్రముఖ విక్రయ కేంద్రమైన 'సోనో విజన్' షోరూమ్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. నిందితులను పట్టుకునేలా పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.గుర్తుతెలియని దుండగులు షాపు తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి, స్టాక్ రూమ్‌లో భద్రపరిచిన విలువైన అధునాతన మొబైల్ ఫోన్లు చోరీ జరిగినట్లు యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. షాపు పరిసర ప్రాంతాలలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

# సర్పంచ్ గారికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు





మన ప్రజాప్రతినిధి//తిరుమలగిరి మండలం తాటిపాముల కాంగ్రెస్ పార్టీ గ్రామ సర్పంచ్ జన్మదిన శుభాకాంక్షలు సందర్భంగా గ్రామ సర్పంచ్ బోయపల్లి కిషన్ గారి చేతుల మీదుగా కేక్ కట్ చేసి వారికి శాలువాలతో సన్మానించి బా నసంచ పేలుస్తూ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నాయని కృష్ణ గారు మాట్లాడుతూ వారు ఎల్లవేళలా సుఖ సంతోషాలతో ఉండాలనిఇలాంటి జన్మదిన శుభాకాంక్షలు మరెన్నో జరుపుకోవాలని అన్నారు జై భీమ్ జై బాబు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్ర యాదగిరి పయ్యంలా దిలీప్ బేతు ప్రవీణ్ జి చంద్రనారాయణ డి కృష్ణ బి శ్రీకాంత్ సిహెచ్ సోమయ్య ఏ సురేందర్ ఏ నరేష్ జే సుమన్ ఈ కార్యక్రమంలో నాయకులుయువకులు పార్టీ కార్యకర్తలు ఘనంగా పాల్గొనడం జరిగింది

# నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం...ఎం ఎల్ ఎ



మన ప్రజా ప్రతినిధి తేదీ11/06/2026 గురువారం:గామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడమే లక్ష్యంగా తాను తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమ శాయశక్తుల కృషి చేస్తున్నానని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ అన్నారు గురువారం నాడు తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంగా ఎన్నో ఉద్యమాలు నిర్వహించి రాష్ట్రం ఏర్పాటు లోభాగస్వామ్యానని అన్నారు ఈ ప్రాంతంలో ఉద్యమకారునిగా గ్రామ గ్రామం తిరిగి గ్రామంలో ఉన్న సమస్యలన్నీ ప్రజల కష్టాలు రైతుల బాధలు, విద్యార్థుల ఇబ్బందులు ఇవన్నీ తెలుసుకున్నానని అన్నారు అందుకే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో ఈ ప్రజలు ఆశీర్వదించి గెలిపించారనీ వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు తుంగతుర్తి నియోజకవర్గం లోని తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి ఇంటిగ్రేటెడ్ స్కూలును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు జిల్లా మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి సహకారంతో పాఠశాలను మంజూరు చేయించానని అన్నారు పాఠశాల నేషనల్ హైవే పక్కనే ఉండడం చాలా అదృష్టమని అన్నారు 98 సర్వే నెంబర్ లో 25 ఎకరాలను పాఠశాల నిర్మాణం కోసం కేటాయించామని అన్నారు ఇందుకోసం సుమారు 200 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అని చెప్పారు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడం కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాఠశాలల మంజూరు చేశారని ఇందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాన ని చెప్పారు ఈ పాఠశాల 2028 వరకు పూర్తయి ప్రారంభించే దిశలో ముందుకు సాగుతుందని ఆయన చెప్పారు పాఠశాల ప్రారంభిస్తే 2600 మంది విద్యార్థులకు అవకాశం దొరుకుతుందని అని చెప్పారు దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య దొరుకుతుందని ఆయన చెప్పారు అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు దూసుకుపోతుందని అని చెప్పారు ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కిందని అని చెప్పారు రైతులకు బోనస్ రైతుబంధు ధాన్యం కొనుగోలు పంటల బీమా లాంటి పథకాలతో పాటు ప్రజలకు నూతన రేషన్ కార్డులు సన్నబియ్యం పంపిణీ ఇందిరమ్మ ఇండ్లు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని అన్నారు మొదటి విడతగా నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు కాగా రెండో విడత మరో 2500 ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు , నిరుపేద ల కలలు నిజం చేసేందుకే ఇందిరమ్మ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఆయన చెప్పారు అలాగే దేవాదుల పథకం కింద మండలంలోని సుమారు 8 గ్రామాలకు 11,వేల ఎకరాలలో నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని అని చెప్పారు అలాగే బు నాది గాని కాలును కూడా త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన చెప్పారు, ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వై నరేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మి లాల్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మూల అశోక్ రెడ్డి సుంకర జనార్ధన్ కాంగ్రెస్ పార్టీమీడియా ఇంచార్జి కందుకూరు లక్ష్మయ్య తొండ సర్పంచ్ భాష మల్ల స్వాతి భాస్కర్, వేణు రెడ్డి ఫతేపురం సుధాకర్ తో పాటు అధికారులు పాల్గొన్నారు

# వెంచర్ ను పరిశీలించిన అదనపు కలెక్టర్



మనప్రజాప్రతినిధి తేదీ11/06/2026 గురువారం: తిరుమలగిరి మున్సిపాలిటీ సర్వేనెంబర్ 433 మరియు 438 నాలా వెంచర్ ను అదనపు జిల్లా కలెక్టర్ సూర్యాపేట విజిట్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల తహశీల్దార్ హరి ప్రసాద్ మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి మండల గిర్దవర్ మండల డిప్యూటీ సర్వేయర్ కమిషనర్ వెంకన్న మరియు ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగింది సార్.

# ఏఐ వినియోగంతో పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుంది






మనప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఏఐ సాంకేతికతను ప్రతి ఒక్కరూ అవలంబించాలి సాంకేతిక పరిజ్ఞానంతో సేవల నాణ్యతను మెరుగుపరచాలి శిక్షణలను సద్వినియోగం చేసుకుని పనిలో ప్రతిఫలింపజేయా ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా,సమర్థవంతంగా అందించాలి ఏఐ సాంకేతికత వినియోగం ద్వారా ప్రభుత్వ పనితీరులో వేగం, సామర్థ్యం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌లి తెలిపారు. ప్రతి అధికారి, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించి తమ పనిని మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం ద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను నేర్చుకుని, తమ దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరు పరిమితంగా కాకుండా, అందులో నేర్చుకున్న విషయాలను పనిలో ప్రతిఫలింపజేయాలని అన్నారు.ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన, నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.శిక్షణ కార్యక్రమాలకు సమయపాలనతో హాజరై, పూర్తి స్థాయిలో పాల్గొనాలని, నేర్చుకునే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, మాస్టర్ ట్రైనర్స్ వాసుదేవన్ నటరాజన్ దేవరాజ్, రాహుల్, జిల్లా అధికారులు , కలెక్టరేట్ పరిపాలన అధికారి సంబంధిత అధికారులు,అన్నీ శాఖల సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాల పై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలి



మనప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా: సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాలపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ వి సి హాల్ నందు ఉపాధి హామీ పథకం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేయుత పెన్షన్లలో ఫేస్ అథెంటికేషన్ త్వరగా పూర్తిచేయాలని పెన్షన్లలో అర్హులు, అనర్హుల జాబితా రిజిస్టర్లు తప్పక నిర్వహించాలని, ఎంపీడీవో లాగిన్ లో ఉన్న పెండింగ్ వాటికి అప్రూవల్ ఇవ్వాలని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సంబంధించి అన్నింటికి మరుగుదొడ్లు పూర్తి చేయాలని అలాగే కొత్తగా నిర్మించుకున్న ఇండ్లకు కూడా మరుగుదొడ్లు మంజూరు చేయాలని, గ్రామ పంచాయతీల దగ్గర ఉన్న వాటికి సామూహిక మరుగుదొడ్లు పూర్తి చేయాలని రానున్న వర్షాల దృష్ట డ్రైనేజ్, ఇంకుడు గుంతలు పూర్తి చేయాలని రాబోవు వన మహోత్సవం సందర్భంగా చెట్లు నాటడానికి స్థలాలను గుర్తించి గుంతలు తీయించాలని, పండ్ల తోటలు మునగ తోటలు పెంచు లబ్ధిదారులను గుర్తించి వారికి ఉపాధి హామీ కింద లబ్ధి చేకూరేలా చేయాలని ఉపాధి హామీ మెటీరియల్ ప్రభుత్వం నుండి విడుదలైన నిధులను పూర్తి అయిన పనులకు చెల్లింపులు చేసి నిధులు వినియోగించుకోవాలని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పి డి సన్యాసయ్య, జడ్పి సి ఇ ఓ శిరీష, డీపీఓ యాదగిరి, అడిషనల్ డిఆర్డిఓ చంద్రశేఖర్, సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు





మనప్రజాప్రతినిధి//సిద్దిపేట:తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలు ,ప్రభుత్వ రంగ సంస్థలు, వివిధ రకాల కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ మరియు కాంట్రాక్టు ఉద్యోగులందరికీ నెలలో ఒకటో తారీకు నాడే జీతాలు ఇవ్వాలని ప్రభుత్వం సర్కులర్ జారీ చేసి ఈ ప్రక్రియ అంతా సకాలంలో జరిగాడానికి జాప్యం జరగకుండా ఉండడానికి ఒక సీనియర్ అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చినందుకు రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ & కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపినట్లుగా భావిస్తూ ఈరోజు సిద్దిపేట్ జిల్లా కలెక్టర్ కార్యాలయం కేంద్రంగా అన్ని రకాల శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ గౌరవ ముఖ్యమంత్రి గారికి పాలాభిషేకం చేసి ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఉద్యోగులందరూ స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకోవడం జరిగింది.ఈ ప్రజా ప్రభుత్వం అందరికీ సకాలంలో జీతాలు చెల్లిస్తూ ప్రమాద బీమాను 50 లక్షల రూపాయలు ఇవ్వాలని చనిపోయిన కుటుంబాలకి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగంలోకి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో మరియు సిద్దిపేట జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో గౌరవ ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు చెబుతూ ప్రభుత్వం వెంటనే నెలలో ఒకటో తారీకు సంబంధించిన మార్గదర్శకాలను అమలు చేయాలని ఇవ్వాలనిగౌర ముఖ్యమంత్రి గారికి ఔట్సోర్సింగ్ మరియు కాంట్రాక్టు ఉద్యోగులందరూ రుణపడి ఉంటామని తెలియజేయడం జరిగిందిఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ పుల్లగుర్ల రాజిరెడ్డి, జేఏసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పొన్నమల్ల యాదగిరి, డివిజన్ కార్యదర్శి నవీన్, సాయిబాబా, కేశవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల రాజమల్లు, రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రం డీఈఓ ఆఫీస్ అశోక్, అరవింద్ నాగరాజ్, సంతోస్, మమత, లావణ్య మరియు కలెక్టరేట్ వింగ్, ప్రెసిడెంట్ కపిల్ రెడ్డి నాగరాజు అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ & కాంట్రాక్ట్ ఉద్యోగులుఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది

# కామ్రేడ్ షాపురం అనిత కు విప్లవ జోహార్లు





మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :సంయుక్త పత్రిక ప్రకటనలో తెలియజేసిన ఐ.ఎఫ్.టి.యు షేక్ షావలి, పిఓడబ్ల్యూ(విముక్తి) షేక్ షావలి.21 సంవత్సరాల షాపురం శివ కుమారిడి మరణం ఆమెను క్రుంగదీసింది. నిజమాబాద్ జిల్లా, బోదన్ కు చెందిన పిఓడబ్ల్యూ (విముక్తి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకురాలిగా కొనసాగిన షాపురం అనిత మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆమే మరణం విప్లవ ప్రతిఘటన ఉద్యమ్యాలకు తీరనిలోటు అని ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కార్యదర్శి షేక్ షావలి, పిఓడబ్ల్యూ (విముక్తి) పెర్క సునీత గురువారం రోజు పంపిన ఒక సంయుక్త పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. 2026, జూన్-10 , బుధవారం రోజు రాత్రి సుమారు 11 గంటల 30 నిమిషాల మధ్య ఆమే గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాదపడుతూ, గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారాని, ఆమే మృతికి తీవ్ర సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు మరియు బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కామ్రేడ్ అనిత సాయుధ విప్లవ కారిణిగా, ప్రజా సంఘ నాయకురాలిగా అనేక ప్రజా ఉద్యమాల్లో, వర్గ పోరాటాల్లో చురుకుగా కొనసాగిందని అన్నారు. బీడి కార్మిక సమస్యలపైననే గాక, మహిళలను సమీకరించి, భూమి, ఇళ్ళ స్థలాల కొరకు పోరాడిందని గుర్తుచేశారు. గత మూడు సంవత్సరాల కిందట 21 సంవత్సరాలు ఉన్న కుమారిడి మరణం ఆమేను తీవ్ర మనోవేధనకు గురిచేసిందని గుర్తుచేశారు. బీపి., షుగర్ లాంటి అనారోగ్యంతో పాటు పలు శారీరక భాదలు ఆమేను కృంగదీసీ, గుండెపోటుకు దారితీసి మరణించడానికి కారణమైందని అన్నారు. ఈ సందర్భంగా అనితక్కకు వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని షేక్ షావలి, పెర్క సునీత ప్రకటనలో తెలియజేశారు.